క్లుప్తంగా

మే 2న సర్వసభ్య సమావేశం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మే 2వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చినము నయ్య ఆదివారం తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల అబ్జర్వర్

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల వివరాలు, వసతులను చిట్యాల తహసీల్దార్ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ మాట్లాడుతూ ఓటర్లకు సకాలంలో పోలింగ్ చీటీలు అందించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ సైదాబాబు, బీఎల్‌ఓలు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

చండూరు : గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామానికి చెందిన ఖలీల్ (15) ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.34,500 ఆర్థిక సహాయం అందజేశారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నారోజు కుమారస్వామి ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ సమక్షంలో హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తోపాటు మరికొందరు అవలంబిస్తున్న విధానాలు నచ్చకపోవడంతోనే పార్టీ మా రానని తెలిపారు. ఆయనతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ చిట్యాల పట్టణంలోని సంతోష్‌నగర్, ప్రియానగర్‌లో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె వెంకన్నగౌడ్, బూత్ అధ్యక్షుడు సాగర్ల మహేష్‌యాదవ్, గోశిక వెంకటేశం, సైదులు, చిర్రబోయిన కృష్ణ పాల్గొన్నారు.

మునుగోడు: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మునుగోడులోని పలు కాలనీల్లో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. బొడ్డు నాగరాజు గౌడ్, ఏర్పుల నగేష్, ఎండీ సాజిద్, మేకల మహేష్, గోసుకొండ శివ, వట్టికోటి గణేశ్, యాట నరేష్, అనిల్, మణిదీప్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

కనగల్ : మండలంలోని బచ్చన్నగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుండెబోయిన రాజు, ప్రధాన కార్యదర్శిగా గుండబోయిన చందు, ఉపాధ్యక్షులుగా బుర్రి రవి, వనం గిరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండెబోయిన నరసింహ, బుర్రి కృష్ణారెడ్డి, గుండబోయిన శ్రీనివాస్, ఎడ్ల గణేశ్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి

చండూరు(గట్టుప్పల్) : తేరట్‌పల్లి గ్రామానికి బొడ్డుపల్లి సత్తయ్య (50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

చెరువు మట్టి అక్రమంగా తరలింపు !



అప్పాజీపేటలోని చెరువులో తవ్విన గాతులు



దోమలపల్లి-అప్పాజీపేట రోడ్డు

- రోడ్డు నిర్మాణానికి తవ్వుతున్నా పట్టించుకోని అధికారులు
- రైతులు పొలాల్లోకి తీసుకెళ్తామంటే అడ్డగింత

నల్లగొండ రూరల్ : పంట చేలకు చేరాల్సిన చెరువు ఒండ్రు మట్టిని రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు. రైతులు పంట పొలాల్లోకి చెరువు మట్టిని తరలిస్తే అడ్డుకుంటున్న అధికారులు.. రోడ్డు నిర్మాణ పనులకు మట్టి తరలిస్తే అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో చెరువు మట్టిని ఓ రైతు తన పొలంలోకి తరలిస్తే అభ్యంతరం తెలిపిన అధికారులు.. రోడ్డు నిర్మాణానికి తరలిస్తే పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

టిప్పర్ల ద్వారా తరలింపు

నల్లగొండ మండలం దోమలపల్లి నుంచి అప్పాజీపేట వరకు 5 కి.మీ. బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పాజీపేట చెరువులో 20 ఫీట్ల వరకు మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అదేవిధంగా మరికొందరు రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా చెరువు లోపల జేసీబీలు పెట్టి వ్యాపార అవసరాలకు మట్టిని తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం చెరువు లోపల మట్టిని నాలుగు ఫీట్ల లోతు వరకు మాత్రమే తవ్వాలి. చెరువులో ఒండ్రు మట్టిని తీయడం వల్ల నీరు నిల్వ నిలకడగా ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయి. అదే సమయంలో ఒండ్రును రైతుల పొలాలకు తరలించడం వల్ల పంట దిగుబడి బాగా వస్తుంది.

రోడ్డు పనుల్లో నాణ్యతపై అనుమానాలు

నిబంధనలకు విరుద్ధంగా చెరువు లోపల 20 ఫీట్ల లోతు మట్టిని తవ్వడం వల్ల చెరువులో నీరు నిల్వ ఉండకపోగా వేగంగా భూమిలోకి అడుగంటిపోతాయి. ఫలితంగా నీటి ఎద్దడి ఏర్పడుతుంది. చెరువు మట్టిని రోడ్డు నిర్మాణానికి ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధం. అయినప్పటికీ చెరువు మట్టిని రోడ్డు నిర్మాణాలకు ఉపయోగిస్తుండడంతో రోడ్డు పనుల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే మట్టిని ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు జరుగుతోందని గ్రామస్తులు రైతులు ఆరోపిస్తున్నారు.

అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు



చెరువు మట్టిని పొలంలోకి తరలిస్తే అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చెరువులో మట్టిని రోడ్డు నిర్మాణానికి, ఇతర వ్యాపార పనులకు తరలిస్తే అధికారులు పట్టించుకోలేదు. రైతుల పొలాల్లోకి ఒండ్రు మట్టి తరలించేందుకు అధికారులు అనుమతించాలి.

-బి. రవి, అప్పాజీపేట

మట్టి తరలింపు నిలిపివేస్తాం

చెరువు నుంచి మట్టి తరలింపును వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పంపి నిలిపివేస్తాం. రాత్రి వేళల్లో మట్టి తరలింపు విషయమై మా దృష్టికి రాలేదు. మట్టిని తరలించే వారు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని చెప్పాం.

-ఇందు, ఏఈ

కాంగ్రెస్ పార్టీలోకి కొనసాగుతున్న వలసలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : కాంగ్రెస్ పార్టీలోకి మర్రిగూడ మండలం నుంచి వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని రాంరెడ్డిపల్లి, దామెరబీమనపల్లి గ్రామాల్లోని పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ రావు, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో ఆదివారం మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాముల యాదయ్య, దామెరబీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు, మాజీ సర్పంచ్ పాక నగేష్‌యాదవ్, భీమనగాని యాదయ్య, మాదగోని కృష్ణయ్య, లపంగి నరసింహ, రావుల రాములుగౌడ్, వెన్నమనేని దామోదర్‌రావు, కారింగు నరసింహ, బండి హనుమంతు, కొండా శ్రీరాములు, వడ్డె సైదులు, లపంగి రత్నం, నడిమింటి శ్రీను, కొండ మహేందర్, పల్లేటి కృష్ణయ్య, లపంగి కృష్ణ, కొండ యాదయ్య, లపంగి సుదర్శన్ పాల్గొన్నారు.

మతోన్మాద, అవకాశవాదులను తరిమికొట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



మునుగోడు : కల్వలపల్లిలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

మునుగోడు: మతోన్మాద, అవకాశవాద రాజకీయాలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్ సుత్తి కొడవలి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం కల్వలపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పదేళ్లుగా దేశంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పూర్తిగా విఫలమైయిందని ఆరోపించారు. దేశ సంపదను, ఆస్తులను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని, అలాంటి పార్టీకి మరోమారు అవకాశం ఇస్తే దేశాన్ని తాకట్టు పెడుతుందన్నారు. మునుగోడు నేటికీ అభివృద్ధి చెందకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమే అన్నారు. జహంగీర్‌ను గెలిపిస్తే భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ల నర్సింహ, మండల కమిటీ సభ్యుడు సాగర్ల మల్లేష్, వంటిపాక అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన పార్టీలను ఓడించాలి

మర్రిగూడ : భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. ఆదివారం తిరగండ్లపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. 35 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నీలకంఠం రాములు, వెంకటయ్య, చెల్లం ముత్యాలు, నారోజు అంజయ్య, బుర్రి పెంటయ్య, లక్ష్మయ్య, రమణయ్య పాల్గొన్నారు.

దుప్పట్లు, స్వీట్ల పంపిణీ

చండూరు(గట్టుప్పల్) : మండల పరిధిలోని అంతంపేట దేవులతండాలో బీఎస్ఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఆ ఫౌండేషన్ చైర్మన్ బానావత్ సుధాకర్‌నాయక్ పండ్లను, చౌటుప్పల్‌లోని అమ్మానాన్న ఆశ్రమంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయి మందిర వార్షికోత్సవం



నకిరేకల్‌లోని ఐశ్వర్యసాయి మందిరం

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని ఐశ్వర్యసాయి మందిరం 17 వార్షికోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభకానున్నాయి. వేడుకల సందర్భంగా వేసవిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నకిరేకల్ సాయి ఆలయం విరాజిల్లుతోంది.

ఐశ్వర్య సాయిగా..

హైదరాబాద్-విజయవాడ 65 నంబర్ జాతీయ రహదారిపై నకిరేకల్‌లో రూ.5 కోట్ల వ్యయంతో దాతల సహకారంతో భారీ హంగులతో సాయి మందిరం, కల్యాణ మండపాలను నిర్మించారు. సాయి మందిరాన్ని జాతీయ రహదారి వెంట సువిశాలమైన ప్రదేశంలో అతి సుందరంగా నిర్మించడంతో జిల్లా ప్రజలే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పరిసర ప్రాంతవాసులు సందర్శిస్తున్నారు. 2007 ఏప్రిల్ 30వ తేదీన శ్రీ రమణానంద మహర్షి చేతులమీదుగా సాయి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ సాయి నాథుడిని ఐశ్వర్య సాయిగా భక్తులు పిలుస్తుంటారు. ఈ ఆలయం పక్కనే షిర్డీసాయి కల్యాణ మండపాన్ని కూడా నిర్మించారు.

రెండు రోజుల పాటు మందిర వార్షికోత్సవాలు

శ్రీ సాయిబాబా మందిర 17వ వార్షికోత్సవం, శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి నవమి వార్షికోత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్నాయి. 29న ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు శ్రీమహా గణాధిపతి పూజ, మండపారాధన, అభిషేకాలు, 30న శ్రీ సాయి నాథుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 7గంటలకు శ్రీ సాయినాథుడి ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ట్రస్ట్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ తెలిపారు.

రైతుల శ్రమదానం



నీటి వృథాను అరికడుతున్న రైతులు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వకు రామన్నపేట మండలం తుర్కపల్లి వద్ద ధ్వంసమైన తూముల నుంచి వృథాగా పోతున్న వరద నీటిని రైతులు ఆదివారం శ్రమదానం చేసి అరికట్టారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని రామగిరి, శాలిలింగోటం, గురుజాల గ్రామాలకు చెందిన రైతులు తూముల వద్ద గడ్డికట్టలు, ఇసుక బస్తాలు అడ్డుగా పెట్టి నీటివృథా జరుగకుండా చేశారు. కొన్నిరోజులుగా మూసీనది నుంచి రాచకాల్వ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు ప్రవహిస్తుండడంతో తుర్కపల్లి వద్ద రాచకాల్వపై ధ్వంసమైన షట్టర్ల ద్వారా వరదనీరు వృథాగా పోతోంది. దీంతో ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ప్రవాహం తగ్గింది. ఈనేపథ్యంలో రైతుసంఘం నాయకులు చామల వెంకటరమణారెడ్డి నేతృత్వంలో రైతులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల రైతులు ననుబోతు అంజయ్య, లింగయ్య, వెంకన్న, లోడె సర్వయ్య పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో ఎగిసిపడిన మంటలు



చందనపల్లి వద్ద డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలు

నల్లగొండ రూరల్: నీలగిరి మున్సిపాలిటీకి చెందిన చందనపల్లి చెత్త డంపింగ్ యార్డులో శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో చందనపల్లి గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. మంటలు గాలికి లేచి తమ గ్రామంపై పడతాయేమోనని ఆందోళన చెందారు. జాతీయ రహదారి వెంట వెళ్లే వాహనదారులు సైతం భయాందోళనకు గురయ్యారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి విషయం తెలియడంతో ఫైరింజన్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చెత్త డంపింగ్ యార్డులో మంటలు ఎగిసి పడకుండా ఆర్పివేశారు. అయితే రహదారిపై కిలోమీటర్ పొడవునా 24 గంటలు పొగ, మంట, వేడిగాలి రావడంతో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. కుక్కలు రోడ్లపై తిష్ట వేసి వాహనదారులపై అకస్మాత్తుగా దాడులు చేయడంతో అదుపు తప్పి వాహనదారులు కింద పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు చెత్త డంపింగ్ యార్డు తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు వల్ల పానగల్ చెరువు నీరు కలుషితం అవుతోందన్నారు. అనారోగ్యంతో గ్రామస్తులు ఆస్పత్రి పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం: మండలంలోని ఆకారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని సంతోషం వ్యక్తం చేసుకున్నారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు నరహరి, జానకిరాంరెడ్డి, రామ్మూర్తి, రమేష్, శోభ, కోటేశ్వర్‌లను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కారు, కమలం ఖతం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న అభిమానానికి పార్లమెంట్ ఎన్నికల్లో కారు, కమలం ఖతం కావడం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామని, రైతాంగానికి రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు నెలలో అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే శాలిగౌరారం మండలంలో అభివృద్ధి పనులకు రూ.70 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఐదేళ్లు భువనగిరి ఎంపీగా పనిచేసిన బూర నర్సయ్యగౌడ్ నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకే ఓట్ల కోసం వస్తున్నాడని, ప్రజలు ఓటుతోనే బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, పాదూరి శంకర్‌రెడ్డి, ఎర్ర చైతన్య, గూని వెంకటయ్య, చింత ధనుంజయ్య, షేక్ జహంగీర్, చామల మహేందర్‌రెడ్డి, నోముల జనార్దన్, షేక్ ఇంతియాజ్, మల్లయ్య, నరేశ్, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, సంకటి లింగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి



బోనాల ఊరేగింపులో డోలు వాయిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్

మునుగోడు: ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని, దైవభక్తి కలిగినవారికి సత్ ప్రవర్తన అలవడుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామంలోని కుర్మ కులస్తులు ఆదివారం బీరప్ప బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు అందంగా అలంకరించిన బోనం కుండలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. ఈ వేడుకల్లో శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. అంతకుముందు జమస్థాన్‌పల్లి గ్రామంలో జరిగిన బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఈదులకంటి కైలాస్‌గౌడ్, పోగుల ప్రకాష్, పానుగంటి విజయ్, బూడిద మల్లికార్జున్, మాజీ సర్పంచ్ వల్లూరి పద్మ లింగయ్య, ఎంపీటీసీ మిర్యాల బీరప్ప, మాలిగ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన, శాంతి కల్యాణం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కనగల్: మండలంలోని బుడుమర్లపల్లిలో శ్రీ సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, భక్తాంజనేయ, భవాని శంకర, నవగ్రహ, ధ్వజస్తంభ, శిఖర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు, సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణాన్ని ఆదివారం వేద పండితుల మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ ఎంపీపీ ఎస్.కె కరీం పాష, వంగాల సహదేవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మందడి రామచంద్రారెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, మాదగోని శ్రీనివాస్ గౌడ్, శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్ , కారింగు పార్వతమ్మ జానయ్యగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు చెదురుపల్లి సైదులుగౌడ్, మామిడాల నరసింహ, శివ, బొడ్డుపల్లి శ్రీను, పంతంగి సైదులుగౌడ్, కందుల మారయ్య, శ్రీనివాస్ సత్తయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం



చర్లపల్లిలో వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు



నృత్యం చేస్తున్న పోతురాజులు



మునుగోడు: జమస్థాన్‌పల్లిలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణ పరిధిలోని చర్లపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు శంకర్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంతోపాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

దేశ భద్రతకు బీజేపీకి ఓటు వేయాలి

- నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

కనగల్ : దేశ భద్రత, సుస్థిరపాలన కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో 400ఎంపీ సీట్లను గెలుచుకొని కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీని కుటుంబ పార్టీగా ఆయన అభివర్ణించారు. నల్లగొండ ప్రజలు ఆలోచించి తనను గెలిపిస్తే నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారి విస్తరణ, కనగల్ మైల సముద్రం చెరువులో పూడిక తీసి చెరువును అభివృద్ధి చేసేందుకు నిధులు తీసుకొస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ పిల్లి రామరాజు యాదవ్, జిల్లా నాయకులు వంగూరి రాఖి, మండల అధ్యక్షుడు పుల్కరం భిక్షం, దాసరి వెంకన్న, బైరగోని అశోక్‌గౌడ్, టి.కనకయ్య, నందగౌడ్, ఎటిల్లి సైదులు, క్రాంతి, ఒట్టికోటి దుర్గా, భద్రమ్మ, పాలకూరి సరిత, ఎస్.వెంకన్న,"సిహెచ్.యాదగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి



సదస్సులో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

నకిరేకల్ : కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చారిత్మాక అవసరమని ఉమ్మడి రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని వైశ్యభవన్‌లో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం సమాచార హక్కు చట్టం ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం రాష్ట్ర గౌవర సలహాదారులు కోటగిరి దైవాదీనం, జిల్లా అధ్యక్షుడు బైరు సైదులు, ప్రతినిధులు చిత్రం శ్రీనివాస్, ఎర్రమాద హేమలత, గంధమల్ల జయంత్, రామకృష్ణ, శంకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.